క్లుప్తంగా

వన్యప్రాణులపై అవగాహన ఉండాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న అధికారులు

పాల్వంచరూరల్: ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవం సందర్భంగా వైల్డ్‌లైఫ్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కిన్నెరసానిలో విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించి వన్యప్రాణులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యానంబైల్ రేంజర్ శ్రీనివాసరావు మాట్లాడారు. వన్యప్రాణులపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, వాటి సంరక్షణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ ఆఫీసర్ చలపతిరావు, బీట్ ఆఫీసర్ రవికుమార్, వైల్డ్‌లైఫ్ సిబ్బంది, యానంబైల్, కిన్నెరసాని, కోడిపుంజలవాగు గ్రామాల ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన అభ్యర్థులతోనే నియామకాలు చేపట్టాలి

జూలూరుపాడు: డీఎస్సీ 2024లో ఉపాధ్యాయ నియామకాలు ఏజెన్సీలో రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రకారం గిరిజన అభ్యర్థులతోనే చేపట్టాలని టీఎస్‌టీటీఎఫ్ మండల అధ్యక్షుడు మాలోత్ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి హలావత్ నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలను మంజూరు చేయాలన్నారు.

దుకాణాదారులకు నోటీసులు

టేకులపల్లి: మండలకేంద్రంలో రోడ్డు వెంబడి వివిధ రకాల వ్యాపారాలు నిర్వహిస్తున్న షాపు యజమానులకు టేకులపల్లి ఎస్‌ఐ రవూఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నోటీసులు జారీ చేశారు. షాపులకు సంబంధించిన నేమ్ బోర్డులు, ఫ్లెక్సీలు, ఐరన్ బోర్డులు రోడ్డు మీద పెట్టొద్దని, షాపు ముందు వాహనాలు నిలిపి ఉంచొద్దు, షాపు వద్ద పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసుకోవాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఖురాన్ స్ఫూర్తితో ఆదర్శ జీవనం సాగించాలి



మాట్లాడుతున్న మౌలానా

ఇల్లెందురూరల్: ఖురాన్ స్ఫూర్తితో ప్రతీ ముస్లిం ఆదర్శ జీవనం సాగించాలని మతపెద్ద మౌలానా రైజువాన్ సాహెబ్ సూచించారు. మండలంలోని బొజ్జాయిగూడెం శివారులోని ఎస్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లింల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషిలో క్రమశిక్షణ, ఐక్యత, సర్వమానవ సౌభ్రాతృత్వం, సహనశీలం, భక్తిపారాయణత్వం, మనోనిశ్చలత, దానగుణాన్ని పెంపొందించే మహత్తరమైన నెల రంజాన్ అని గుర్తుచేశారు. ఈ నెలలో ఆచరించేవన్నీ జీవితంలో అన్ని రోజులలోనూ ఆచరించాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు బానిసలై ఉజ్వల భవిష్యత్‌ను చిన్నాభిన్నం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి వారిని గుర్తించి వారిలో మార్పు తేవడం ప్రతి ముస్లిం బాధ్యతగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమాజంలో ఉన్నత పౌరులుగా గుర్తింపు తెచ్చుకునేందుకు అహర్నిషలు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇనాయితుల్లా, ఇబ్రహీం పాల్గొన్నారు.

పోలియో మహమ్మారిని తరిమేయాలి..

ఇల్లెందు: చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలే అవసరం అని ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. మాట్లాడుతూ.. పుట్టిన బిడ్డ నుంచి ఐదు ఏళ్లలోపు చిన్నారులకు తప్పకుండా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఇల్లెందు ఆస్పత్రి పరిధిలో 24 బూత్‌లు, రెండు ట్రాన్సిట్ కేంద్రాలు, ఒక మొబైల్ టీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణంలో 3,905 మంది చిన్నారులు ఉన్నారని తెలిపారు. బస్టాండ్, కరెంటాఫీస్ వద్ద కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. 3,835 మంది చిన్నారులకు తొలిరోజు పోలియో చుక్కలు వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు అలీ, మనోహర్, సీహెచ్‌ఓ స్వర్ణలత, డీపీఎంఓ గన్యా, హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్‌కుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ హరికృష్ణ, రూట్ సూపర్‌వైజర్ రమణ, విజయ, వైద్య, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

టేకులపల్లి: టేకులపల్లి మండలంలో ఆదివారం పల్స్‌పోలియో చుక్కల మందు పంపిణీ కార్యక్రమం విజయవంతమైంది. టేకులపల్లి సెంటర్‌లో పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. బోడులో ఎంపీపీ భూక్య రాధ ప్రారంభించారు. టేకులపల్లి మండలంలో మొత్తం 4606 మంది 5 సంవత్సరాల లోపు పిల్లలు ఉండగా మొదటి రోజు 50 కేంద్రాలు, 1 ట్రాన్సిట్ కేంద్రం, 1 మొబైల్ కేంద్రంలో మొత్తం 4441 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కందుల దినేష్, సీహెచ్‌వో వజ్జా పార్వతి, హెచ్‌ఈఓ దేవా, సూపర్‌వైజర్లు పోరండ్ల శ్రీనివాస్, గుజ్జా విజయ, ఫార్మసిస్ట్ రవి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మండలంలోని రొంపేడు, కొమరారం పీహెచ్‌సీల పరిధిలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. పీహెచ్‌సీల పరిధిలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలలో ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, వైద్యాధికారులు డాక్టర్ కవిత, డాక్టర్ లోహిత చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. రొంపేడు పీహెచ్‌సీ పరిధిలో 2,,269, కొమరారం పీహెచ్‌సీ పరిధిలో 2,368 చిన్నారులకు గాను 95 శాతం మందికి పోలియో చుక్కలు వేశారు. ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలను ఉదయమే ప్రారంభించడంతో ప్రజలు అధిక సంఖ్యలో ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకున్నారు. గ్రామాలకు దూరంగా గుడారాలు ఏర్పాటు చేసుకున్న వలస కూలీల వద్దకు వెళ్లి చిన్నారులను గుర్తించి వారికి కూడా వైద్యాధికారులు పోలియో చుక్కలు వేశారు.

జూలూరుపాడు: మండలంలో ఆదివారం జరిగిన పల్స్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం విజయవంతమైంది. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో 0–5 సంవత్సరాల పిల్లలకు పల్స్ పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. జూలూరుపాడు బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ట్రాన్సిట్ పాయింట్‌లో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ కుమార్ పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సురారంలో డాక్టర్ వెంకటేశ్వర్లు, పీహెచ్‌సీలో డాక్టర్ తేజశ్వనిలు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. 24 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన బూత్‌లలో పిల్లలకు ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు పోలియో చుక్కలు వేశారు. డాక్టర్ రాకేష్ కుమార్ మాట్లాడుతూ... 3,512 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాలనే లక్ష్యంగా కాగా, 3,410 మందికి వేసినట్లు చెప్పారు. 96.1 శాతం పోలియో చుక్కలు వేయడం జరిగిందని, మిగిలిన పిల్లలకు సోమ, మంగళవారం వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వి.వెంకటేశ్వర్లు, హెచ్‌ఎస్ రత్నకుమార్, హెచ్‌వీలు సుభద్రమ్మ, రాధిక, ఫార్మాసిస్ట్ సౌమ్య, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్‌ఎంలు మంగమ్మ, తార, రాజమ్మ, ఆదిలక్ష్మి, వెంకటముత్యం, రీనా, సావిత్రి, రాణి, జీజ, అనూష, సుశీల, పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: పోలియో మహమ్మారిని పారదోలడానికి ప్రతీ చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. జగన్నాథపురం పీహెచ్‌సీ పరిధి పెద్దమ్మగుడి వద్ద ఆదివారం చిన్నారికి పోలియో చుక్కలు వేసి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాట్లాడుతూ.. పోలియో రహిత తెలంగాణ స్థాపనలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మడవి సరస్వతి, ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, సీడీపీఓ కనకదుర్గ, జగన్నాథపురం పీహెచ్‌సీ డాక్టర్ రాజు, హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణయ్య, దేవమ్మ, శ్రీనిధి, ఏఎన్‌ఎంలు వసంతకుమారి, జహీరున్నీసా బేగం, గంధం నర్సింహారావు, నందనాయక్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. ఉల్వనూరు పీహెచ్‌సీలో జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు చిన్నారికి పోలియో చుక్కలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పీహెచ్‌సీ పరిధిలో 1700 మంది చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ తేజశ్రీ తెలిపారు. అదేవిధంగా మారుమూల అటవీ ప్రాంతం ఉల్వనూరు పీహెచ్‌సీ పరిధిలోని రాళ్లచెలక, బుసురాయి గొత్తికోయగుంపులో ఆదివారం వైద్యసిబ్బంది చైతన్యకుమార్ గ్రామానికి వెళ్లి పల్స్ పోలియో చుక్కలువేశారు.

నవభారత్: కొత్తగూడెం మున్సిపల్ పరిధిలో ఆదివారం పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి ప్రారంభించారు. మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు.

సుజాతనగర్: మండలంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం అయింది. సుజాతనగర్ సీహెచ్‌సీ పరిధిలో 0–5 వయస్సు కలిగిన చిన్నారులు 3,925 మందికి గాను తొలిరోజు 3,817 మందికి పోలియో చుక్కలు వేశారు. 97 శాతం చుక్కల పంపిణీ జరిగిన్నట్లు వైద్యాధికారి రమేష్ తెలిపారు.



ఇల్లెందు: ప్రభుత్వాస్పత్రిలో పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, చైర్మన్ డీవీ



పాల్వంచ: పోలియో చుక్కలు వేస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



టేకులపల్లి: బొమ్మనపల్లి గ్రామంలో...



జూలూరుపాడు: బస్టాండ్‌లో పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ రాకేష్‌కుమార్



నవభారత్: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి



సుజాతనగర్: ప్రభుత్వాస్పత్రిలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి రమేష్






పాల్వంచరూరల్: పెద్దమ్మగుడి వద్ద... డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల, బుసురాయిలో గొత్తికోయ చిన్నారులకు, ఇల్లెందురూరల్: కూలీల వద్దకు వెళ్లి పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ కవిత, కొమరారంలో...

క్రికెట్ పోటీలు

ఇల్లెందు: ఇల్లెందు సింగరేణి గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన జేకేసీసీ, ఎఫ్‌సీజీ జట్ల మధ్య క్రికెట్ టెస్టు మ్యాచ్ ఆహ్లాదంగా సాగింది. తొలుత ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావులు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. మాట్లాడుతూ.. ఆహ్లాదకర వాతావరణంలో ఆటను కొనసాగించాలని, గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని క్రీడాకారులను కోరారు. జేకేసీసీ జట్టు విజేతగా నిలిచింది.

త్రివేణి పాఠశాలలో ఫన్‌ఫెస్ట్



ఫన్‌ఫెస్ట్‌లో పాల్గొన్న డీఈఓ, డీఎస్పీ

కొత్తగూడెంరూరల్: విద్యార్థులు కష్టపడి చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి అన్నారు. ఆదివారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని త్రివేణి పాఠశాలలో 30వ ఫన్‌ఫెస్ట్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చినా ఆయన మాట్లాడుతూ... పిల్లల పట్టుదలతో చదువుకోవటం వల్ల లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. విద్యాసంస్థలు చదువులతోపాటు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించటం చాలా బాగుందన్నారు. విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలన్నారు. డీఎస్పీ అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎదిగే వయసులో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో త్రివేణి, కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్లు గొల్లపూడి జగదీశ్, మాచవరపు కోటేశ్వరరావు, గొల్లపూడి వీరేంద్రచౌదరి, సీఆర్‌ఓ కాట్రగడ్డ మురళీ కృష్ణ, ప్రిన్సిపాల్ వైవీ సురేష్, శ్రీనివాస్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మంగీలాల్‌కు సన్మానం

టేకులపల్లి: ఇటీవల హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదులుగా కొందరిని నియమించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా టేకులపల్లి మండలం తావుర్యా తండాకు చెందిన ఎల్‌హెచ్‌పీఎస్ నాయకుడు భూక్యా మంగీలాల్ నాయక్‌ను ప్రభుత్వ న్యాయవాదిగా నియమించారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రంలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు మంగీలాల్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. మంగీలాల్ నాయక్ గిరిజన సమస్యలపై రాజీలేని పోరాటాలు చేశారని, కాంగ్రెస్ పార్టీలో చేరి మండల నాయకత్వం నుంచి పార్టీ రాష్ట్ర నాయకత్వం ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారని, తరువాత టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శిగా అంకితభావంతో పని చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన బిడ్డ భూక్యా మంగీలాల్ సేవలను గుర్తించి హైకోర్టు న్యాయవాదిగా నియమించడం హర్షించదగ్గ విషయమన్నారు. సురేష్ నాయక్, దస్రు నాయక్, మోతిలాల్, లక్ష్మణ్ నాయక్, హరికిషన్ నాయక్ , రమణ నాయక్ , పాండు నాయక్, రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత ప్రకారం అభివృద్ధి పనులు

పాల్వంచ: ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం ప్రభుత్వాస్పత్రిలో పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభించారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం పట్టణంలోని అయ్యప్పనగర్, శ్రీనివాస కాలనీ, బొల్లేరుగూడెం ఏరియాల్లో రూ.1.20 కోట్ల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. అంబేద్కర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపాలిటీ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాల అమలుకు కసరత్తు చేస్తోందన్నారు. కార్యక్రమాల్లో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, తహసీల్దార్ వివేక్, కమిషనర్ స్వామి, డీసీహెచ్‌ఎస్ రవిబాబు, డీఎంహెచ్‌ఓ శిరీష, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవనాన్ని శంకుస్థాపన చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో రూ.50లక్షల ఎస్సీ కార్పొరేషన్ నిధులతో మంజూరైన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన నిర్మాణ పనులకు, సోములగూడెం గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించునున్న సీసీ రోడ్డుకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో తహసీలార్ వివేక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంజీవరావు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, పీఆర్ డీఈ రామకృష్ణ, ఏఈ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



సోములగూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

హర్షం

టేకులపల్లి: హైదరాబాద్ ట్యాంక్ బండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల రజక సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కణతాల వసంతరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. చాకలి ఐలమ్మతో పాటు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్, దుద్దిళ్ల శ్రీపాదరావు విగ్రహాలు కూడా ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న దోభీ ఉద్యోగాలన్నీ రజకులకే ఇవ్వాలని, ప్రతి జిల్లా కేంద్రంలో రజక భవనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు



ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు శ్రీకోట మైసమ్మ తల్లి ఆలయ 9వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి సున్నం ఓంకారా చారి ఆధ్వర్యంలో పూజారులు నవగ్రహ మండపరాధన, హోమం, కలిశ పూజలు, గణపతి పూజ, శ్రీకోటమైసమ్మ తల్లి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. పాపకొల్లు గ్రామంతోపాటు, శివారు గ్రామాల ప్రజలకు ఇలవేల్పు శ్రీకోటమైసమ్మ తల్లి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

మండలంలో ఆధ్యాత్మిక శోభ

- నేటి నుంచి లింగబసవేశ్వర జాతర
- 5 నుంచి పెద్దమ్మతల్లి...
- 7 నుంచి కొండెంగులబోడు వీరభద్ర స్వామి తిరునాళ్ల
- 8న సిద్ధారంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం
- 18 నుంచి సంపత్‌నగర్‌లో వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలు



పెద్దమ్మతల్లి ఆలయం



సంపత్‌నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం

టేకులపల్లి: మార్చి నెలలో టేకులపల్లి మండలంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొననుంది. ఎక్కడ చూసినా భక్తి పారవశ్యం, పూజలు, జాతరలు, సంబరాలే కనిపించనున్నాయి. టేకులపల్లి మండలంతో పాటు భద్రాద్రి, ఖమ్మం జిల్లాలు, ఇతర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరు కానున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకోనున్నారు.

ఇప్పలతండాలో లింగబసవేశ్వర జాతర..

టేకులపల్లి మండలం కోయగూడెం పంచాయతీ ఇప్పలతండాలో లింగబసవేశ్వ స్వామి ఆలయంలో ఈనెల 4 నుంచి జరిగే జాతర వివరాలను పూజారులు బానోతు శ్రీను, జర్పుల మంగమ్మ వివరించారు. సోమవారం రాత్రి 8.05లకు శివ పార్వతుల కల్యాణం, మంగళవారం రాత్రి 10 గంటలకు అగ్నిగుండం, బుధవారం ఉదయం 5 గంటలకు స్వామివారి ఊరేగింపు, ప్రత్యేక పూజలు, మొక్కులు ఉంటాయని పేర్కొన్నారు.

5 నుంచి పెద్దమ్మతల్లి తిరునాళ్ల...

టేకులపల్లి మండలం బద్దుతండా పంచాయతీ సీతారామ గుట్టపై వెలిసిన పెద్దమ్మతల్లి ఆలయంలో ఈ నెల 5 నుంచి పెద్దమ్మతల్లి జాతర వేడుకలు జరుగనున్నాయని ఆయల పూజారి భూక్యా సీతారాములు తెలిపారు. 5న ఉదయం 8 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు తిరువతి వెంకన్న పూజలు, ఆ తరువాత పెద్దమ్మతల్లి హోమం, 6న ఉదయం 7 గంటల నుంచి రథయాత్ర, అంగరంగ వైభవంగా అమ్మవారు గుడిలోకి ప్రవేశం, ప్రత్యేక పూజలు, మొక్కులు, ఆ తరువాత నుంచి ఈనెల 8 వరకు జాతర మహోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు.

కొండెంగులబోడు వీరభద్ర ఆలయంలో జాతర...

టేకులపల్లి మండలం మద్రాస్ తండా పంచాయతీ కొండెంగులబోడు గుట్టపై వెలిసిన వీరభద్ర స్వామి భద్రకాళి ఆలయంలో ఈనెల 7 నుంచి స్వామి వారి కల్యాణం, జాతర మహోత్సవం జరగనుందని ఆలయ పూజారి కేలోతు శంకర్ తెలిపారు. 7న అంకురార్పణ, 8న అర్ధరాత్రి మహాశివరాత్రి వేడుకలు, 13న రథోత్సవం, 14న ఎడ్లబండ్ల ఊరేగింపు, పూర్ణాహుతి, దీపోత్సవం, 15న వసంతోత్సవం, నాగావళి, 22న 16 రోజుల పండుగ వేడుకలు జరుగుతాయని చెప్పారు.

సిద్ధారంలో కల్యాణ వేడుకలు..

టేకులపల్లి మండలం గంగారం పంచాయతీ సిద్ధారం నందులగుట్ట అడవిలో వెలిసిన సోమలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 8 నుంచి కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు అర్చకుడు బోయపల్లి రవికుమారాచార్యులు, ఆలయ కమిటీ పెద్దలు కొర్స ఈశ్వరయ్య, దొడ్డ వసంతరావు, దొడ్డ కోటేశ్వరరావు తెలిపారు. 8న ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, అభిషేకాలు, రాత్రి 9.55 గంటలకు శివ పార్వతుల కల్యాణం, 9న ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ ఉంటుందని వెల్లడించారు.

సంపత్‌నగర్‌లో వేంకటేశ్వర కల్యాణ వేడుకలు..

గంగారం పంచాయతీ సంపత్‌నగర్‌లోని కొండపై వెలిసిన వేంకటేశ్వర స్వామి కల్యాణ వేడుకలు ఈనెల 18 నుంచి అంగరంగ వైభవంగా జరుగనున్నాయని యాజ్ఞికులు శ్రీరంగం అజయ్ సాయిచక్రి చార్యులు, శ్రీరంగం విజయ్ సాయిచక్రి చార్యులు తెలిపారు. 18న అభిషేకాలు, స్వామి వారి అలంకరణ, పెళ్లికొడుకును చేయడం, నిత్య పూర్ణాహుతి, తీర్థ ప్రసాదగోష్టి, 19న సుప్రభాత సేవ, యాగశాల అర్చన, స్వామి వారి కల్యాణ మండప ప్రవేశం, కల్యాణ మహోత్సవం, అన్న ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు.

ప్రజాధనం దుర్వినియోగం..

- పాత డ్రెయినేజీలు కూల్చి కొత్త నిర్మాణాలు
- రూ.కోట్లాది నిధులు పక్కదోవ
- పాలకవర్గం లేకపోవడంతో దుభారా అవుతుందని ఆరోపణలు



శ్రీనివాస కాలనీలో డ్రెయినేజీ నిర్మాణ పనులు

పాల్వంచ: ఇప్పటికే పాల్వంచ మున్సిపాలిటీ అనుకున్న స్థాయిలో అభివృద్ధి జరగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇక వచ్చిన నిధులను సద్వినియోగం చేయాల్సిన అధికారులు ఇష్టారాజ్యం వ్యవహరిస్తూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్న డ్రెయినేజీలను కూల్చివేసి కొత్త డ్రెయినేజీలను నిర్మిస్తున్నారు. అసలు డ్రెయినేజీలు లేనిచోట నిధులు కేటాయించకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. శ్రీనివాస కాలనీ, గుడిపాడు గ్రామాల్లో రూ.5.50 కోట్ల నిధులతో డ్రెయినేజీలు ఉన్నచోటే మళ్లీ మంజూరు చేసి నిర్మాణాలు చేస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు.

గతంలోనే డ్రెయినేజీల నిర్మాణాలు...

మురికివాడలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో గతంలో సెంట్రల్ ఫండ్ కింద రూ.కోట్లాది నిధులు పాల్వంచ మున్సిపాలిటీని విడుదలయ్యాయి. ఐదేళ్ల క్రితం ఈ నిధులతో శ్రీనివాసకాలనీ, గుడిపాడు, కొత్తూరు, జయమ్మ కాలనీ, వికలాంగుల కాలనీ, ఇందిరా కాలనీ తదితర ప్రాంతాల్లో చిన్న చిన్న గల్లీలో మొదలు అన్ని ఏరియాల్లో సీసీ రోడ్లు నిర్మించారు. ప్రస్తుతం మళ్లీ అక్కడే నిధులు మంజూరు చేయడం గమనార్హం. శ్రీనివాస కాలనీలో పలుచోట్ల ఉన్న డ్రెయినేజీలను కూల్చి కొత్తగా నిర్మిస్తున్నారు. కేవలం రెండు వీధులు మాత్రమే ఉన్న అతి చిన్న ప్రాంతం ఇది. ఉన్న డ్రెయినేజీలను తొలగించి పెద్ద డ్రెయినేజీల పేరుతో పనులు చేస్తున్నారు. పాలకవర్గం లేకపోవడంతో మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందనంగా మారిందని స్థానికులు వాపోతున్నారు.

ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టి సారించాలి...

పాల్వంచ మున్సిపాలిటీలో జరుగుతున్న అనేక అభివృద్ధి పనులు నాణ్యత లేకుండా జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పాలకవర్గం లేకపోవడం, ఇంజనీరింగ్ విభాగం అధికారుల్లో స్థానచలనం లేకపోవడం, గత పాలకుల హయాంలో జరిగిన పనుల్లో అనేక అవకతవకలు జరిగాయని స్థానికులు అంటున్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇంకా మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులపై దృష్టి సారించలేదని, కలెక్టర్ పర్యవేక్షణ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చిన్నవాటిని తొలగించాం..



గతంలో నిర్మించిన డ్రెయినేజీలు చిన్నగా ఉండటంతో వాటిని తొలగించి పెద్ద డ్రెయినేజీల నిర్మాణాలు చేపట్టడం జరిగింది. నిధులు ఉండటంతో కొత్త వాటికి మంజూరు చేశాం. – ఎ.స్వామి, మున్సిపల్ కమిషనర్